# అంతర్ముఖుడు

**-జగన్మిత్ర**



'నిస్తేజంగా... నిర్జీవంగా మిగిలిపోతుందనుకున్న ఈ జీవితానికి కొత్త ఊపిరిపోస్తున్న మీకే ఈ జీవితాంతం ఋణపడి వుంటాను'.

'అట్లాగే... అట్లాగే పడుందువు గాని... ముందీ చేంతాడు డైలాగుల్ని ఆపేస్తే హాయిగా వుంటుందేమో ఆలోచించు!'

'మనస్సులోని భావనల్ని బయటికి చెప్పుకోలేకపోతే ఎంత ఆరాటంగా ఉంటుందో మీకు అర్థం కాదులెండి!'

'...... అబ్బాయి మొహం గుంభనంగా వున్నా, కళ్ళు మాత్రం నవ్వుతూనే వున్నాయి.

'అదే పనిగా ఆదర్శాలను ఊదరగొడుతూ, సగటు మనుషుల్ని మోసం చేసే వారికంటే... ఏ రకమైన ఆర్భాటాలు లేకుండా, చిత్తశుద్ధితో, మోడువారిన జీవితాల్ని పండించే మీబోటి వారే కదండీ... కందుకూరి వీరేశ లింగాల్ని, రాజారామ మోహన్రాయిల్నీ భూమ్మీద సజీవంగా నిలబెట్టేది!!' అమ్మాయి కళ్ళలో ఆర్ద్రత.

'అబ్బా... నీ ఊదరాపి జరగాల్సిన వ్యవహారం చూడ్రాదూ?!'

'ఊ... ముందు మా అన్నయ్య ఆశీస్సులందుకుందామండి!'

'చంపావ్ పో!! ఇమ్యూని వెళ్ళే మొదటికి జారుస్తున్నావు'

'భలే వారండీ!! మా అన్నయ్యకు నేనో చెల్లెల్ని కాదండి!'

'అవునా???'

'ఊ"

'అంటే.. మీ తెగలో.. చిన్న వాళ్ళను అక్కలనీ, అమ్మమ్మలనీ పిలుచుకుంటారేం??!'

'అది కాదండీ... ఆయనో గురువు. తల్లీ తండ్రీ అన్నయ్యో!

'ఆదర్శాల్నీ, భావ సంస్కృతినీ ఎంతగానో ఎంకరేంజ్ చేస్తారండీ'.

'నిజమా డియర్.. తేలిగ్గా తీసుకుంటున్నావనుకోకేం... సారీ... జోవియల్గా మాట్లాడితే నువ్వు హుషారుగా వుంటావని...'

అబ్బాయి అమ్మాయిని ఆప్యాయంగా దగ్గరగా తీసుకుంటూ అన్నాడు' కందుకూరి వారి కళ్యాణ మండపంలోనే మన పెళ్ళి!'

శంకరయ్య కలం సంతోషంగా కాగితాన్ని నింపుతూనే వుంది. టైము చూసుకుంటే రెండు దాటింది. కిటికీ బయట కారుచీకటి. కుర్చీలోంచి లేచి నృత్య భంగిమలోని కూచిపూడి కుర్రాడిలా బద్ధకం తీసుకున్నాడు... కళ్ళు విప్పారిస్తే, ఎదురుగా గోడకు వేలాడుతున్న పాత అద్దంలో తన నిలువెత్తు ప్రతిబింబం...

''ఏం శంకరయ్యా! కథనం బాగా నడుస్తోందా? ఎంతయినా చెయ్యి తిరిగిన వాడివి కదా... సంస్కరణవాదులంతా సన్మానం చేస్తార్లే... అది సరే... మన్లో మన మాట.. కథలోని కథా నాయకి స్థానంలో నీ చెల్లెలే నిలబడితే... ఆమె నిర్ణయాన్ని నువ్వు ఆమోదించగలుగుతావటయ్యా??'

శంకరయ్య కెందుకో తన రూపం వికృతంగా అగుపించింది. కుర్చీలో కూలబడిపోయాడు. టేబుల్ లేంప్పై చూపు నిలిచిపోయింది.

* * *

శంకరం ఆఫీసు ఫైలు పట్టుకొని, తన సీటు నుండి ఇ-8 సెక్షన్కు వెళ్ళాడు. అక్కడ రవి, శేషు, వర్మ నర్సింగరావు మిగతా కొలీగ్స్ శంకరాన్ని పలకరించారు. పక్కగా వెళ్తున్న అన్నయ్యను చూసి ఉష కూడా పలకరించింది. శంకరం పలకరించలేదు. శంకరంలోని 'శంకరం' గుర్తుకు రావడంతో గిల్టీగా ఫీలయ్యాడు. అందరూ తననే... ఎందుకనో చూస్తున్నట్టుగా ఇబ్బంది పడ్డాడు.

'శంకరం.... కేంటీన్ వైపు వెళ్దాంరా' ఫైలు అందుకుంటూ అన్నాడు హెడ్-అసిస్టెంట్ శీతారామయ్య. కేంటీన్లో మిత్రులిద్దరూ ఆ మూల కూర్చున్నారు.

'జరుగుతున్న మిగతా-విడ్డూరాలు' నీ చెవికి చేర్తున్నట్లేదే!'

'ఈ శీర్షికకు నువ్వేమైనా రాస్తున్నావా?'

'శీర్షికకు నువ్వేమైనా రాస్తున్నావా?'

'శీర్షికలూ లేదు. శీకాయ పులుసూ కాదు గాని... నువ్వేం అనుకోనంటే, మీ కుటుంబానికి ఫ్రండుగా.. ఉష విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను'

'ఏవిట్రోయ్... ఇన్ డిసిప్లేనా? ఇన్ సబార్డినేషనా?' నవ్వుతూ అంటున్నా, కీడు శంకించిన శంకరంలోని శంకరం, హృదయ కవాటాలను పట్టుకొని చిద్విలాసంగా చూస్తూనే వున్నాడు.

'నీకు నవ్వుదలగానే వుంటుంది. కాని వాళ్ళిద్దరి నవ్వుల్నీ చూసి సెక్షనంతా నవ్విపోతోంది. రేపేపాటికి ఉష మెళ్ళో శేషుగాడు తాళికట్టేస్తాట్ట!'

విషయ తీవ్రతను ఆకలింపు చేసుకున్నా, శంకరం రెచ్చిపోలేదు. రెచ్చిపోయి చేయగలిగింది కూడా శూన్యమని శీతారామయ్య రిపోర్టు చెబుతోంది. అందుకే శంకరం సంఘంలో తనకు గల ఆదర్శవాది ముద్రను పదిలంగా కాపాడుకోదలచుకున్నాడు.

అందుకే ప్రశాంతంగా బదులిచ్చాడు. 'శీతారామయ్యా! ఒక్క మాట వింటావుట్రా... నేను కందుకూరి వీరేశలింగం గారిని ఆరాధిస్తానని నీకు తెలుసు. ఆయన సిద్ధాంతాలను ఆచరిస్తాననీ నీకు తెలుసు... నీకో నిజం తెలియదు. ఉషా - శేషులను ఒకటికమ్మని ధైర్యం చెప్పిందీ నేనే!!'

సీతారామయ్య దృష్టిలో శంకరం ఎదిగిపోయాడు.

* * *

ఆ సాయంకాలం శంకరం ఆఫీసు నుండి ఇంటికి బయల్దేరాడు. పార్కు

మొన మలుపులో ఉషా, శేషూ నిలబడ ఎదురు చూస్తూ వున్నారు.

మలుపు తిరగంగావే ఎదురుపడ్డ ఇద్దర్నీ చూసి ఓ క్షణం సైకిల్ పెడలింగుమ ఆపాడు.

'అన్నయ్యా!'

'సర్!'

ఇద్దరి పిలుపులూ వినబడినా శంకరం సైకిలు ఆగలేదు. ఇల్లు చేరుకునే వేళకు ఆరైంది. భార్య లోపలెక్కడ్నో వున్నట్టుగా అలికిడి. కొడుకు, కూతురు హాలు చివర్న డిస్కస్ చేసుకుంటున్నారు.

శంకరం భారంగా వాలుకుర్చీలో కూలబడిన తీరుకు పిల్లలిద్దరూ తండ్రి రాకను గమనించి దగ్గరకొచ్చారు.

'నాన్నా! ఎలెక్ట్యుషన్లో చెల్లాయికి ఫస్టొచ్చింది'

'అవున్నానా! సబ్జెక్టు కందుకూరిగారి మీదన్నారు. అంతే... అదరగొట్టే శావమకో' గర్వంగా చెప్పింది కూతురు.

'చడీచప్పుడు లేకుండా ఎంత సేపయిందండీ వచ్చీ??' హాల్లోకి వస్తూ అడిగింది భార్య.

'.......... '

శంకరయ్య మూడీగా వున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. భర్తలో స్పందన లేకపోవడంతో ఆయన మొహంలోకి పరీక్షగా చూసి, 'ఏవండీ... ఎందుకండీ డల్‌గా ఉన్నారు?' అంటూ ఆరా తీసింది.

బావిలో పడిపోయిన మాటల మూటలలోంచి ఒక్కో మాటనూ బయటికి చేదుతున్నట్టుగా గొంతు విప్పాడు శంకరం.

'శేషు అనే కొలీగ్‌తో... మన ఉష..'

'పాపం ఉష! ఏ పాపం చేసుకుందో ఏమో... వ్యసనాల పుట్ట అయిన జగ్గారావుకు కట్టబెట్టినా కిక్కురుమనలేదు. ఏ సుఖమూ చేరువకాకముందే... జగ్గారావు తొందరపడి ఉషను వొంటరిదాన్ని చేసేస్తే.. ఆ తర్వాత బురఖామ నిర్దాక్షిణ్యంగా తన మీద కప్పేసిన వదిన ప్రవర్తనను కూడా ఉష తప్పులు పట్టలేదు. పాపం ఉష!! ....' స్వగతంలో అనుకుంటున్న శంకరయ్యను ఎవరో పలకరించినట్టయి ఉష ఫోటో మీది నుంచి దృష్టిని మరల్చాడు.

'ఏం శంకరయ్యా! ఉష తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నావా?' గోడకున్న నిలువుటద్దంలో శంకరయ్య.

'ఏవయ్యా! ఎదిగొచ్చిన కూతురి భవిష్యత్తు గురించి ఆలోచించవా? ఒక విధంగా వివాహాన్ని... ఒక కులాంతర బంధాన్ని నువ్వాదరిస్తే చేతికందొచ్చిన నీ పిల్లల పరిస్థితిని చక్కదిద్దగలిగే స్థోమత నీకుందా?

ఎవరో ఏదో అనుకుంటారని చెప్పి... సనాతనంగా వస్తున్న నీ కుటుంబ సాంప్రదాయాలకూ, కట్టుబాట్లకూ గండి కొట్టుకుంటోవా? నువ్వో మూర్ఖుడవని, ఆచారాల పిశాచానివనీ వేలెత్తి చూపిస్తారని భయపడుతున్నావే! వాళ్ళలో ఎవరైనా ముందుకు వచ్చి నీ పిల్లల అచ్చటా - ముచ్చటా తీరుస్తారనుకుంటున్నావా? ఈ సంఘం, సంఘ సంస్కరణలంటూ ఆదర్శాలు చెప్పే వాళ్ళంతా నీ అవసరాలకు ఆమడ దూరంలో ఉంటారయ్యా! ఆలోచించు...'

'ఛఛ' ... అద్దంలోంచి మొహాన్ని చాటేసి, ఆలోచనల్లోకి జారిపోయాడు. అంతా సందిగ్ధావస్థ!! టెన్షన్... హైటెన్షన్... తమ ఇంటి సాంప్రదాయాల చావడిలో చెల్లెలి భవిష్యత్తు! చెల్లెలికి ఆసరా ఇస్తే పిల్లల భవిష్యత్తు!!

తన అశక్తత చేస్తున్న రాపిడికి శంకరయ్య గుండె నలిగిపోతోంది. ఆ ఉద్వేగంలో కంటికెదురుగా ముగింపుకోరుతున్న అసంపూర్ణ రచనకు ముగింపు నివ్వాలని కాగితాలను ముందేసుకు కూర్చున్నాడు గాని, కలం కదలలేదు.

'ఆలోచన... ఆవేదన... ఆవేశం... ఆక్రందన.. ఉద్వేగం... 'అమ్మా' అంటూ కిందికి జారిపోయిన శంకరయ్య చుట్టూరా భార్యాపిల్లలు ముసురుకున్నారు. అత్యవసరంగా పిలిపించుకు వచ్చిన డాక్టరు గారు శంకరయ్య నాడీ గమనాన్ని పరీక్షించి 'హార్ట్ ఎటాక్' అని తేల్చి చెప్పేసరికి ఇంటిల్లిపాదీ ఘొల్లుమన్నారు.

తెలతెలవారుతుండగా... ఉష శేషు ఆదర్శ కుటీరాన్ని చేరుకుంటున్న సమయానికే శంకరయ్య స్పృహలోకి వచ్చాడు. ఆదర్శాలను ఆవిష్కరించే ఆనవాయితీ గల ఆ తెనుగు రచయితకు కందుకూరి వీరేశలింగం గారంటే వల్లమాలిన ఆరాధన. ఆయన రచనల నిండా విరి సంస్మరణే! అయితే ఆ మహా మనీషి నిర్దేశించిన సంస్కరణ మార్గానికి నిజ జీవితంలో కూడా ఆహ్వానం పలికి వుంటే శంకరయ్యకు ఇంతటి మానసిక్క క్షోభ మిగిలేది కాదు.

ఆ శుభోదయాన ఆదర్శ కుటీరంలో నిండుగా, నిర్మలంగా, నిరాడంబరంగా జరిగిన వితంతు వివాహాన్ని ఆశీర్వదించలేని సంఘటనా మిగిలేది కాదు!




మానవాళి ఐక్యతకు జరిగే పోరు ఉగ్రవాదానికి, ఉగ్రరూపానికి దారి తీస్తే ఎదురయ్యే విపత్కర పరిస్థితులను ఉత్కంఠభరితంగా చిత్రీకరించిన అక్షరమాలిక

గుమ్మడి రవీంద్రనాథ్

సీరియల్

మృత్యు సంగీతం

— వచ్చేవారమే ప్రారంభం!